నిధులు లేక.. నిలిచిన పనులు

- అసంపూర్తిగా చిన్నరావులపల్లి ఆరోగ్య ఉపకేంద్రం భవన నిర్మాణ పనులు
- ఏడాదవుతున్నా ఇంకా స్లాబ్ దశలోనే..
- త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని వేడుకోలు

బీబీనగర్: మండలంలోని చిన్నరావులపల్లి గ్రామంలో నిర్మించ తలపెట్టిన ఆరోగ్య ఉపకేంద్రం భవన నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. పనులను ప్రారంభించి పదకొండు నెలలు గడుస్తున్నా పనులు ఇంకా స్లాబు దశలో ఉన్నాయి. గ్రామంలో గల ఆరోగ్య ఉప కేంద్రం భవనం శిథిలావస్థకు చేరింది. దీంతో గత ప్రభుత్వ హయాంలో నూతన భవన నిర్మాణానికి రూ. 20లక్షలు మంజూరయ్యాయి. 2023 ఆగస్టులో అప్పటి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పీహెచ్‌సీ సబ్ సెంటర్ పనులను ఏడాది క్రితం ప్రారంభించిన భవన నిర్మాణ పనులు స్లాబు దశలోనే నిలిచిపోయాయి. చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులు రాకపోవడం.. మిగతా పనులు చేపట్టడానికి తగిన నిధులు లేకపోవడంతో పనుల్లో కొంత జాప్యం జరుగుతోందని అధికారులు చెబుతున్నారు.

వైద్య సేవలకు ఇబ్బందులు

ఈ ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం చిన్నరావులపల్లి, భట్టుగూడెం, రామునిగుండ్ల తండా గ్రామ పంచాయితీలకు అనుసంధానంగా ఉంది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ఇక్కడికే వచ్చి వైద్య సేవలు పొందుతున్నారు. అయితే గ్రామంలో ప్రస్తుతమున్న భవనం శిథిలావస్థకు చేరడంతో వైద్య సేవలు అందించడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. శిథిలావస్థకు చేరిన భవనంలో సిబ్బంది బిక్కుబిక్కుమని విధులు నిర్వహించాల్సి వస్తోంది. ఇక్కడకు వస్తున్న రోగులు కూడా ఇబ్బందిపడుతున్నారు. గ్రామంలో నిర్మిస్తున్న ఆరోగ్య ఉపకేంద్రం అందుబాటులోకి వస్తే చుట్టుపక్కల ప్రజలకు మెరుగైన వైద్య సేవలందుతాయని పలువురు వాపోతున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్ర భవన నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



స్లాబ్ దశలో నిలిచిన భవనం

పనులు పూర్తి చేయాలి



గ్రామంలో నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణ పనులు ప్రారంభించి ఏడాది కావొస్తోంది. అయినా ఇంకా స్లాబ్ దశలో పనులు ఉన్నాయి. శిథిలావస్థకు చేరిన పాత భవనంలో సిబ్బంది, రోగులు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ప్రజాప్రతినిధులు అధికారులు స్పందించి భవన నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలని కోరుతున్నాం.

–కొమిరె శ్రీకాంత్, చిన్నరావులపల్లి

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లా

పీహెచ్‌సీ సబ్ సెంటర్ భవన నిర్మాణానికి సంబంధించిన బిల్లులు మంజూరు కాకపోవడంతో నిర్మాణ పనుల్లో జాప్యం జరుగుతోంది. బిల్లుల మంజూరుకు సంబంధించిన విషయం ఇటీవలే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాను. పెండింగ్ బిల్లులు మంజూరు కాగానే భవన నిర్మాణ పనులు జరిగేలా చర్య తీసుకుంటాం.

– లింగయ్య, ఆర్ అండ్‌బీ ఏఈ, బీబీనగర్

అందరికీ విద్య, వైద్యం, ఉపాధి కల్పించాలి

భువనగిరిటౌన్ : అందరికీ విద్య, వైద్యం, ఉపాధి కల్పించాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా కన్వీనర్ నల్లా నరేందర్ అన్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ డీఎస్పీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం అదనపు కలెక్టర్ కే. గంగాధర్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన ఉచిత విద్య, వైద్యంతో పాటు నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలన్నారు. అర్హులైన వారందరికీ సాగునీటి సౌకర్యం గల ఒక ఎకరం వ్యవసాయ భూమిని ఇవ్వాలని, అర్హులైన వారందరికీ 200 గజాల స్థలంలో నాలుగు గదుల ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ రాష్ట్ర కార్యదర్శి వినోద్ యాదవ్, మహేష్ మహారాజ్, శ్రీకాంత్ మహారాజ్, శివ, రవి, అశోక్, సాయి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న ధర్మ సమాజ్ పార్టీ నాయకులు

కొనసాగుతున్న గ్రంథాలయ వారోత్సవాలు

భువనగిరిటౌన్ : పట్టణ కేంద్రంలో గ్రంథాలయ వారోత్సవాలు కొనసాగుతున్నాయి. వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక గ్రంథాలయంలో ఉన్నత పాఠశాలల విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ చైర్మన్ కరిపే నరసింగ రావు మాట్లాడుతూ గ్రంథాలయాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో , ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ రెడ్డి, జంపాల అంజయ్య, శ్రీనివాస్, రమేష, ఆవుల వినోద్ తదితరులు పాల్గొన్నారు

డీఎస్ఈ అడిషనల్ డైరెక్టర్‌ను కలిసిన యూటీఎఫ్ నాయకులు

భువనగిరి : తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సోమవారం డీఎస్ఈ(డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్)ఏడీ లింగయ్యను, పాఠశాల విద్యా ప్రాంతీయ సంయుక్త సంచాలకులు విజయలక్ష్మిని కలిశారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గణేష్, ప్రధాన కార్యదర్శి లచ్చుమల్ల వెంకన్న, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి బుర్ర రమేష్, సంయుక్త కార్యదర్శి సయ్యద్ రూహి, నాయకులు స్నేహ, వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

భువనగిరి: పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీ, రామ్‌నగర్, ఎల్‌బీనగర్, బొమ్మాయిపల్లి అగ్రికల్చర్ ఫీడర్‌పై మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ ఏఈ సాయికృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బొమ్మాయిపల్లి అండర్ పాస్ నుంచి 33/11 కేవీ సబ్ స్టేషన్ వరకు లైన్ షిఫ్టింగ్ పనుల కారణంగా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో నిలిపివేయనున్నట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల్లోని విద్యుత్ వినియోగదారులు గమనించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలన్నారు.

భూదాన్‌పోచంపల్లిలో..

భూదాన్‌పోచంపల్లి : పట్టణ కేంద్రంలో మంగళవారం మధ్యాహ్నం 1.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మెయింటనెన్స్ పనుల కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఏఈ శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా మండలంలోని దేశ్‌ముఖి, పిలాయిపల్లి గ్రామాల్లో 11కేవీ లైన్ మరమ్మతుల కారణంగా ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు గమినించి విద్యుత్ అధికారులకు సహకరించాలని కోరారు.

సంస్థాన్‌నారాయణపురంలో..

సంస్థాన్ నారాయణపురం: మండల కేంద్రం, లింగవారిగూడెంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం ఉదయం 8గంటల 30 నిమిషాల నుంచి మధ్యాహ్నం 12గంటల 30 నిమిషాల వరకు విద్యుత్ సరాఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ దివ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వి నియోగదారులు సిబ్బందికి సహకరించాలన్నారు.

నేడు ‘ఉపాధి’ పనులపై సోషల్ ఆడిట్

రామన్నపేట : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ పనుల పై మంగళవారం సోషల్ ఆడిట్ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బి.యాకుబ్‌నాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1 మార్చి 2023 నుంచి 31 ఏప్రిల్ 2024 మధ్య కాలంలో మండల వ్యాప్తంగా జరిగిన ఉపాధి హామీ పథకం పనులపై సోషల్ ఆడిట్ ఓపెన్ ఫోరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

భూదాన్‌పోచంపల్లి : పట్టణకేంద్రానికి చెందిన సీత మధు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. జెడ్పీహెచ్‌ఎస్ 2006–07 ఎస్సెస్సీ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు సోమవారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించి రూ. 30వేల ఆర్థికసాయం అందజేశారు. అనంతరం మృతుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కందగట్ల నాగేశ్, లింగస్వామి, కిరణ్, యాదగిరి, పరమేశ్ పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కవిత

మోత్కూరు : మున్సిపాలిటీ పరిధిలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి బాబు జగ్జీవన్‌రామ్ చౌరస్తా వరకు నిర్మించ తలపెట్టిన సీసీరోడ్డు నిర్మాణం పనులను సోమవారం మున్సిపల్ చైర్ పర్సన్ గుర్రం కవిత ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సి.శ్రీకాంత్, వైస్ చైర్మన్ బొల్లెపల్లి వెంకటయ్య, వార్డు కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఆంజనేయులు



మోత్కూరు : రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా, ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడి గా మోత్కూరు పట్టణానికి చెందిన గుండు ఆంజనేయులు ఎన్నికయ్యారు. సోమవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన తెలంగాణ రాష్ట్ర రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ఎన్నికల్లో తనను ఎన్నుకున్నట్లు తెలిపారు. తన నియామకానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

కొనసాగుతున్న సర్వే



సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రాములు

ఆత్మకూరు(ఎం): మండల వ్యాప్తంగా సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కొనసాగుతోంది. మండలంలోని తిమ్మాపురంలో నిర్వహిస్తున్న సమగ్ర ఇంటింటి సర్వేను ఎంపీడీఓ రాములు నాయక్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే వివరాల డాటాను నమోదు చేయాల్సి ఉన్నందున సకాలంలో సర్వే పూర్తి చేయాలని ఎన్యుమరేటర్లకు సూచించారు. సారగండ్లగూడెం, మోదుగుకుంట గ్రామాల్లో సర్వే పూర్తయిందన్నారు. ఆయన వెంట సూపరింటెండెంట్ లోకేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ పంపిణీలో అక్రమాలకు పాల్పడితే చర్యలు



భూదాన్‌పోచంపల్లి : రేషన్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న తహసీల్దార్ మహేందర్‌రెడ్డి



ఆత్మకూరు(ఎం) : స్టాక్ వివరాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ వి. రవికుమార్

భూదాన్‌పోచంపల్లి : రేషన్ బియ్యం పంపిణీలో అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని తహసీల్దార్ మహేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణ కేంద్రంలోని పలు రేషన్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఓపెనింగ్ బ్యాలెన్స్, క్లోజింగ్ బ్యాలెన్స్ షీట్‌లను పరిశీలించారు. ఒక్కో షాపులో ఎన్ని కార్డులున్నాయి..ఎంతమందికి బియ్యం పంపిణీ చేశారనే వివరాలు తెలుసుకుని స్టాక్‌ను పరిశీలించారు. ఆయన వెంట ఎంఆర్ఐ గుత్తా వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం): మండల కేంద్రంలోని రేషన్ దుకాణంతో పాటు రహీంఖాన్‌పేట రేషన్ దుకాణంలో సోమవారం తహసీల్దార్ రవికుమార్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్టాక్ రికార్డులను పరిశీలించారు. ప్రతి నెల క్రమం తప్పకుండా నిత్యావసర వస్తువులను పంపిణీ చేయాలని సూచించారు. ఆయన వెంట ఆర్ఐ వై. మల్లిఖార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలి

యాదగిరిగుట్ట : ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలి సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మంగ నర్సింహులు అన్నారు. సోమవారం పట్టణం కేంద్రంలో నిర్వహించిన ఆ పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అధికారంలో ఉన్న పాలకులు ప్రజా సమస్యలు విస్మరించి పదవుల కోసం పాకులాడుతున్నారన్నారు. నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడేది సీపీఎం అన్నారు. ఈ డిసెంబర్ 5వరకు ఇంటింటికీ సీపీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజా ఉద్యమాలను బలపరిచే పార్టీకీ ప్రజలు ఆర్థిక సహకారాన్ని అందించి ఆదరించాలన్నారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి బబ్బూరి పోశెట్టి, మండల కమిటీ సభ్యులు బీమగాని రాములు, కాలే స్వామి, సుబ్బూరు సత్యనారాయణ, జోగు శ్రీనివాస్, నెలపట్ల శంకర్, ఈశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘ఇంటింటికీ సీపీఎం’

బొమ్మలరామారం : మండలంలోని జలాల్‌పూర్ గ్రామంలో సోమవారం ఇంటింటికీ సీపీఎం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దాసరి పాండు మాట్లాడుతూ ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామాల్లో సమస్యలు పేరుకుపోయాయన్నారు. అండర్ డ్రైయినేజీ, అంతర్గత రోడ్లు సరిపడా లేక గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎన్నికల హామీలు ఆరు గ్యారంటీలను అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి ర్యాకల శ్రీశైలం నాయకులు సల్లూరి కుమార్,గోలనుకొండ బ్రహ్మచారి, సాయిలు, రవి, వెంకటేషం, పున్నమ్మ, యాదయ్య, భిక్షపతి, లక్ష్మయ్య, స్వామి, దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.

కంది పంట పరిశీలన



కంది పంట పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

మోత్కూరు : మున్సిపల్ పరిధిలోని ఆరెగూడెం గ్రామంలో సాగు చేసిన కంది పంటలను కృషి విజ్ఞాన కేంద్రం రంగారెడ్డి జిల్లా, కేంద్రియ మెట్ట వ్యవసాయ పరిశోధనా సంస్థ శాస్త్రవేత్తలు పి.రామకృష్ణ, డాక్టర్ గౌతమ్, వి.చౌహాన్ సోమవారం సందర్శించారు. కంది పంట సాగు చేసిన బిక్షపాటి గోవర్ధన్‌రెడ్డి, కొణతం మహేందర్‌రెడ్డి తగు సూచనలు చేశారు.

వ్యాయామ ఉపాధ్యాయులకు సన్మానం



సన్మానిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు

భువనగిరి : ఇటీవల ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందిన జిల్లాకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు బోనాల మహేష్, జెట్ట రవీందర్, అద్దంకి మంజులను సోమవారం జిల్లా వ్యాయమ ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఖోఖో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాతి కృష్ణమూర్తి, కృష్ణమూర్తి, విజయసాగర్, మధుసూదన్, వ్యాయమ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

భువనగిరిటౌన్ : జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా మైనార్టీ నాయకుడు మహ్మద్‌అవైస్‌చిస్తీని నియమించడంపై హర్షం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకులు మహ్మద్ సలావుద్దీన్ సోమవారం ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డిని కలిసి సన్మానించారు. అనంతరం గ్రంథాలయ సంస్థ చైర్మన్ మహ్మద్ అవైస్‌చిస్తీకి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ కైరంకొండ వెంకటేశం ఉన్నారు.

సిమెంట్ పరిశ్రమను రద్దు చేయించాలని వినతి

రామన్నపేట: మండలంలో ఏర్పాటు చేయనున్న అంబుజా సిమెంట్ పరిశ్రమ ఏర్పాటును రద్దు చేయించాలని కోరుతూ పలువురు బీజేపీ నాయకులు సోమవారం ఎంపీ ఈటల రాజేందర్‌ను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఎంపీని కలిసిన వారిలో పార్టీ మండల అధ్యక్షుడు పల్లపు దుర్గయ్య, జిల్లాకమిటీ సభ్యుడు బండ మధుకర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి మిర్యాల రాజ్‌కుమార్, బాషకర్ల నరేందర్‌రెడ్డి, నోముల శ్రీనివాస్ పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ



తహసీల్దార్ కార్యాలయ రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీఓ కృష్ణారెడ్డి

గుండాల : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని భువనగిరి ఆర్డీఓ కృష్ణారెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయ రికార్డులను పరిశీలించారు. ధరణి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని సూచించారు. నిబంధనల మేరకు తేమశాతం ఉన్న ధాన్యాన్ని వెంటనే కాంటా వేసి మిల్లులకు తరలించాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్య తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ జలకుమారి, డిప్యూటీ తహసీల్దార్ నీలిమ పాల్గొన్నారు.

కోర్టు సముదాయాన్ని మరో చోటుకు మార్చొద్దు

రామన్నపేట : మండల కేంద్రంలో మొదట ప్రతిపాదించిన స్థలంలోనే కోర్టు సముదాయాన్ని నిర్మించాలని..మరో చోటుకు మార్చొద్దని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జెల్లెల పెంటయ్య డిమాండ్ చేశారు. సోమవారం జరిగిన ఆ పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కోర్టు నిర్మాణం కోసం ప్రభుత్వం ఐదు ఎకరాల స్థలాన్ని కేటాయించిందన్నారు. కేటాయించిన స్థలంలో కాకుండా చిట్యాల శివారులోని క్రషర్‌మిల్లు వద్దకు మార్చాలనే ప్రయత్నం సరికాదన్నారు. సమావేశంలో బొడ్డుపల్లి వెంకటేశం, బోయిని ఆనంద్, హన్మంత్, గన్నెబోయిన విజయభాస్కర్, ఎండీ రశీద్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

భువనగిరిటౌన్ : ఎన్నికల సమయంలో విద్యార్థులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పల శాంతికుమార్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిల విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మారుపాక లోకేష్, రంపాక చందు, సాయి పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉప్పల శాంతికుమార్

భక్తిశ్రద్ధలతో అయ్యప్పస్వామి మహా పడిపూజ



పడి పూజలో పాల్గొన్న అయ్యప్ప మాలధారులు

భువనగిరి : పట్టణంలోని శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో సోమవారం హైదరాబాద్‌కు చెందిన మొట్టి రాకేష్ కుటుంబ సభ్యుల సహకారంతో నరేంద్ర శర్మ ఆధ్వర్యంలో పడిపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం అయ్యప్ప స్వాములకు అన్నప్రసాదం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు నూనె వెంకటేశ్వర్లు, దిడ్డి సత్యం, శ్యాంసుందర్ ఘటానీ, చీకటిమల్ల రాములు, చింత రవి, సోమన్న, లక్ష్మయ్య, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

దివీస్ పరిశ్రమ అందిస్తున్న సేవలు అభినందనీయం



విద్యార్థులకు మందులు పంపిణీ చేస్తున్న ఎంఈఓ గురువారావు

చౌటుప్పల్ రూరల్: విద్యారంగ అభివృద్ధికి దివీస్ పరిశ్రమ అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎంఈఓ గురువారావు అన్నారు. సోమవారం మండలంలోని దేవలమ్మ నాగారం, అల్లాపురం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో దివీస్ పరిశ్రమ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు దివీస్ పరిశ్రమ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. చదువుల్లో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నర్సింహా రెడ్డి, దివీస్ ప్రతినిధులు సాయికృష్ణ, వంశీ పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సామూహిక వ్రతాలు



సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహిస్తున్న ఆర్యవైశ్యులు

గుండాల : మండల కేంద్రంలో ఆర్యవైశ్యుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను నిర్వహించారు. ఉసిరి చెట్టుకు ప్రత్యేక పూజలు చేసి కార్తీక దీపాలు వెలిగించారు. అనంతరం తమ కుటుంబ సభ్యులతో కలిసి వన భోజనాలు చేశారు. కార్యక్రమంలో జి.నాగరాజు, లింగయ్య, ఇమ్మడి దశరథ, రమేష్, శ్రీనివాస్, మల్లయ్య, బాలలింగం, సతీష్, కిరణ్, శేఖర్, గణేష్ పలువురు ఆర్యవైశ్యులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

అడ్డగూడూరు : కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలని, తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆశవర్కర్లు సోమవారం ఎమ్మెల్యే మందుల సామేల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశవర్కర్లు అమృత, సుజాత, కవిత, స్వరూప, శైలజా మంజుల పాల్గొన్నారు.

గిరిజన నాయకుల అరెస్ట్

సంస్థాన్ నారాయణపురం: వికారాబాద్ జిల్లా లగచర్లలో గిరిజనులు చేపట్టిన ధర్నాకు వెళ్లకుండా స్థానిక గిరిజన నాయకులను పోలీస్‌లు సోమవారం ముందస్తుగా అరెస్టు చేశారు. అనంతరం వ్యక్తిగత పూచికత్తుపై వదిలిపెట్టారు. అరెస్టయిన వారిలో లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జలందర్‌నాయక్, సమితి మండల అధ్యక్షుడు కొర్ర దేవా, జగన్ పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

చౌటుప్పల్ రూరల్: మండలంలోని తుప్రాన్‌పేట గ్రామ పరిధిలో గల జాతీయ రహదారిపై చౌటుప్పల్ ఎస్ఐ కనకటి యాదగిరి ఆధ్వర్యంలో సోమవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. వికారాబాద్ జిల్లాలోని లగచర్లకు వెళ్లకుండా పలువురు బీఆర్ఎస్ నాయకులను అడ్డుకున్నారు.

గడ్డి ట్రాక్టర్లతో పరేషాన్



రోడ్డంతా ఆక్రమించి వెళ్తున్న గడ్డి ట్రాక్టర్

భూదాన్‌పోచంపల్లి : పరిమితికి మించి గడ్డిని లోడ్ చేసుకుని వెళ్తున్న ట్రాక్టర్లతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. మూసీ పరీవాహకంలో వరికోతలు పూర్తవడంతో వరి గడ్డి పుష్కలంగా లభ్యమవుతుంది. దీంతో భూదాన్‌పోచంపల్లి మండలంలోని వివిధ గ్రామాల నుంచి నిత్యం వందల సంఖ్యలో గడ్డి కట్టల ట్రాక్టర్లు ఇతర ప్రాంతాలకు వెళ్తున్నాయి. అయితే ట్రాక్టర్ ట్రాలీ బయటికి వచ్చేలా ఇరువైపులా గడ్డికట్టలు లోడ్ చేసుకుని రోడ్డంతా ఆక్రమించి వెళ్తుండడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

భువనగిరిటౌన్ : మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఇమ్రాన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మధ్యాహ్న భోజన వంట కార్మికులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలన్నారు. మెస్ చార్జీలను వెంటనే పెంచాలన్నారు. అనంతరం కలెక్టరేట్ ఏఓ జగన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యులు సామల శోభన్ బాబు, మధ్యాహ్నం భోజనం పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బాగుల వసంత, ప్రధాన కార్యదర్శి ముంతాజ్ బేగం, నాయకులు గుర్రాల రాజమణి, అనసూర్య, సంధ్య, లక్ష్మి, మమత, వీరస్వామి, గౌసియా, వాణి, అండాలు, కృష్ణవేణి, సుగుణ పాల్గొన్నారు.

పత్తి కాంటాల్లో ఆలస్యం.. రైతుల మధ్య వాగ్వాదం



కాంటా కోసం ఆగిన పత్తి లోడు వాహనాలు

ఆత్మకూరు(ఎం): మండల కేంద్రంలోని శ్రీసిద్దేశ్వర కాటన్ మిల్లు వద్ద సోమవారం రైతుల మధ్య వాగ్వాదం జరిగింది. కాటన్ మిల్లులో ఈ నెల 4న సీసీఐ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. చుట్టుపక్కల మండలాల నుంచి భారీ ఎత్తున పత్తి లోడుతో వాహనాలు వస్తున్నాయి. ఇప్పటి వరకు 552 మంది రైతుల నుంచి 15.436 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశారు. పత్తి లోడు వాహనాలు రాత్రి నుంచే వచ్చి వరుసలో ఉంటున్నాయి. పత్తి కాంటా వేయడానికి సుమారు 18గంటల సమయం పడుతుంది. దీంతో సహనం కోల్పోయిన కొందరు రైతులు సోమవారం తమ పత్తిని ముందు కాంటా వేయాలని ఇతర రైతులతో గొడవ పడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని రైతులకు నచ్చజెప్పడంతో సమస్య సద్దుమణిగింది.

అండెం కొండల్ రెడ్డికి నివాళి



కొండల్ రెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

గుండాల : డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి తండ్రి అండెం కొండల్‌రెడ్డి అనారోగ్యంతో మృతి చెందాడు. సోమవారం కొండల్‌రెడ్డి మృత దేహాన్ని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో ఎమ్మెల్యేలు బీర్ల అయిలయ్య, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, మందుల సామేల్, నాయకులు మధుసూదన్‌రెడ్డి, యాదగిరి, పీఏసీఎస్ చైర్మన్ లింగాల భిక్షం గౌడ్ తదితరులు ఉన్నారు.

దేశెట్టి బుచ్చయ్య సేవలు మరువలేనివి



దేశెట్టి బుచ్చయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

బొమ్మలరామారం : మండలంలోని మర్యాల గ్రామానికి మాజీ సర్పంచ్ దేశెట్టి బుచ్చయ్య చేసిన సేవలు మరువలేనివని పలువురు నాయకులు అన్నారు. సోమవారం ఆయన వర్ధంతిని గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో భువనగిరి మార్కెట్ కమిటీ డైరెక్టర్ దేశెట్టి చంద్రశేఖర్, శ్రీనునాయక్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ మోకు మధుసూదన్ రెడ్డి, చీర సత్యనారాయణ, రామిడి శ్రవణ్ రెడ్డి, రాజిరెడ్డి, ముద్దం శ్రీకాంత్ రెడ్డి, మన్నె శ్రీధర్, దయాకర్ రెడ్డి, సంగి గణేష్, చీర శ్రీశైలం,లక్ష్మీనారయణ పాల్గొన్నారు.